'ఆడబిడ్డ నిధి'కి ఎగనామం!

- ఏడాదిన్నర కావస్తున్నా అమలుకాని హామీ
- ఎన్నికల హామీ విస్మరిస్తున్న కూటమి
- వైఎస్సార్ సీపీ హయాంలో మహిళలకు ప్రాధాన్యం

ముప్పాళ్ళ: అధికారంలోకి వస్తే 18 నుంచి 59 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి 'ఆడబిడ్డ నిధి' ఇస్తామని ఊదరగొట్టిన 'కూటమి' అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని అటకెక్కించేలా ఉంది పాలకుల తీరు. సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్ అంటూ ఊరూ వాడా ప్రచార ఆర్భాటం చేసి.. ఆడబిడ్డ నిధికి ఎగనామం పెట్టేట్లు ఉన్నారనే విమర్శలు మహిళల నుంచి వ్యక్తమవుతున్నాయి. అధికారం చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా పథకం ఊసే లేదు.

పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలంటూ ఓ కీలక మంత్రి మాట్లాడిన మాటలను గుర్తు చేసుకుంటున్నారు. గతంలో డ్వాక్రా రుణాల మాఫీ పేరుతో చంద్రబాబునాయుడు చేసిన మోసాలను మహిళలు మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు. అధికారంలోకి రావడానికి ఇష్టాను సారం హామీలిచ్చి వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు హామీ అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


డ్వాక్రా మహిళలు (ఫైల్)

నాడు ఇంటింటికీ సంక్షేమ పథకాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమయ్యాయి. అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, సున్నావడ్డీ, వైఎస్సార్ చేయూత వంటి పథకాల సొమ్ము మహిళల ఖాతాలకు వచ్చాయి. కూటమి సర్కార్ వచ్చి ఏడాదిన్నర అయినా ఆడబిడ్డ నిధి పథకం అమలు నోచుకోలేదు. ఎప్పుడు అమలు చేస్తారో.. అసలు లేదంటారో అనే సంశయాన్ని మహిళలు వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో మహిళలకు లబ్ధి...

మండలంలో మొత్తం 1,050 డ్వాక్రా సంఘాలున్నాయి. అందులో సుమారు 10,470 మంది మహిళలు ఉన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆసరా కింద మొదట విడతగా 847 సంఘాలకు రూ.7.10 కోట్లు, రెండవ విడతలో 848 సంఘాలకు గాను రూ.7.90 కోట్లు సాయం అందించారు. అమ్మ ఒడి పథకం కింద 18,350 మందికి రూ.27,52,50,000 కోట్లు, చేయూత పథకం కింద 17,980 మందికి రూ. 33,71,25,000 కోట్లు చెల్లించారు.

ఒక్కో మహిళకు రూ.27 వేలు బాకీ ఉంది



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుపై నమ్మకం లేదు. ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పారు. ఏడాదిన్నర అవుతుంది. ఒక్కో మహిళకు రూ.27,000 బకాయి రావాల్సి ఉంది.

–అన్నపురెడ్డి రమాదేవి, స్వర్ణాంధ్ర గ్రూపు, చాగంటివారిపాలెం

ఎవరూ సమాధానం చెప్పడం లేదు



పథకం అమలు గురించి ఎవర్ని అడిగినా సమాధానం చెప్పడం లేదు. రెండో సంవత్సరంలోనైనా ఇస్తారని ఆశగా ఎదురు చూస్తున్నాం. ఏడాదిన్నర కావస్తున్నా ఆడబిడ్డ పథకంపై ఇంత వరకు ఎలాంటి ప్రకటన ఇవ్వటం లేదు. అమలు చేయలేనప్పుడు హామీ ఇవ్వడం ఎందుకు. మరోసారి మహిళలను మోసం చేసేలా ఉన్నారు.

–చిగుళ్ళ వెంకాయమ్మ, వీరరాఘవేంద్ర మహిళా గ్రూపు, చాగంటివారిపాలెం

క్లుప్తంగా

మాలధారులకు అన్నదానం



దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలో నిర్మిస్తున్న విఘ్నేశ్వర దత్తాత్రేయ సమేత షిర్డీ సాయిబాబా దేవాలయంలో అయ్యప్ప మాలధారులకు 41 రోజుల పాటు జరిగే అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. బెల్లంకొండ మండలం నాగిరెడ్డిపాలెంకు చెందిన దక్షిణామూర్తి ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యాన అయ్యప్పలకు నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అయ్యప్పలు, దేవాలయ చారిటబుల్ ట్రస్టు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దావుపల్లి తండాలో మెడికల్ క్యాంపు



వెల్దుర్తి: ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో ముందు జాగ్రత్త చర్యగా శనివారం డీఎంహెచ్ఓ పర్యవేక్షణలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపునకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ నల్లమల అడవిలో మారుమూల ప్రాంతంలోని దావుపల్లి తండాలో మెడికల్ క్యాంపు నిర్వహించటం జరిగిందన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురుగుకాల్వలలోని మురుగును ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వారానికొకసారి డ్రై డే ను పాటించాలన్నారు. దోమతెరలు వాడితే రోగాలబారిన పడకుండా తప్పించుకోవచ్చన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హెల్త్ సిబ్బంది తండాలలో వారానికొకసారి క్యాంపు నిర్వహించి వారికి కావాల్సిన మందులను పంపిణీ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. డీఎంఓ కె.రవీంద్ర రత్నాకర్, పిహెచ్‌సీ డాక్టర్ దాక్షాయణి, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



వినుకొండ: స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో నియోజకవర్గంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల డీలర్లకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు మాట్లాడుతూ డీలర్లు ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయించరాదని, ఎవరైనా అలా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు బ్లాక్ బర్లీ టుబాకో సాగు చేయకూడదన్నారు. మొక్కజొన్న విత్తన పథకం కింద సాగు చేసే రైతులు సంబంధిత కంపెనీ నుంచి బాండ్ తీసుకున్న తరువాత మాత్రమే మొక్కజొన్న పంట సాగు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ డీలర్లు ఎరువులు డీబీటీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. యూరియా అవసరం మేరకే కొనుగోలు చేయాలన్నారు. ఏడీఏ రవికుమార్, ఏఓలు జి.వరలక్ష్మి, అంకారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు చెల్లించాలి

ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజి

నాదెండ్ల: నిత్యం దైవచింతనలో గడిపే ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజి కోరారు. ఈ మేరకు నాదెండ్ల మండలం తూబాడు గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన గౌరవ వేతనాన్ని కూటమి ప్రభుత్వం పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. ఏడాది పైగా గడుస్తున్నా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవటంతో పేదరికంలో ఉన్న ఇమామ్, మౌజన్‌లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నా రు. ప్రభుత్వం వెంటనే గౌరవ వేతనాన్ని చెల్లించి వారిని ఆదుకోవాలని కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

శావల్యాపురం: శావల్యాపురం పోలీసు స్టేషన్‌ను వినుకొండ రూరల్ సీఐ బొప్పన బ్రహ్మయ్య శనివారం సందర్శించారు. బ్రహ్మయ్య విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు విజువల్ పోలీసు విధుల్లో భాగంగా గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి మార్గంలో వాహనాలు తనిఖీ చేశామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

సీజేఐ గవాయిపై దాడికి నిరసన



అమరావతి: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ భూషణ్ రామకృష్ణగవాయిపై లాయర్ రాకేష్ కిషోర్ బూటుతో చేసిన దాడిని ఖండిస్తూ శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. నేతలు దారా ప్రసాద్, తోకల సూరిబాబు, ఉపాధ్యాయుడు గుడిసె దేవరాజు, దాసు, విశ్రాంత ఉపాధ్యాయుడు రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

14న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాలులో ఈనెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వశాఖల పనితీరుపై ప్రత్యేకంగా చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, అందరు ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, అన్ని గ్రామాల సర్పంచ్‌లు హాజరు కావలసినదిగా ఆయన కోరారు.

ఘనంగా 'గజ్జల' జన్మదిన వేడుకలు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ముప్పాళ్ళ మండలంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని చాగంటివారిపాలెంలో శ్రీసాయిబాబా ఆలయం వద్ద కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. సుధీర్‌భార్గవరెడ్డి కేక్ కట్ చేశారు. దమ్మాలపాడు అడ్డరోడ్డు వద్ద వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్‌చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో, వడ్డవల్లిలోని మొల్లమాంబ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేశారు, పరివర్తన పాఠశాలలో జన్మదిన వేడుకలు జరిగాయి. అనంతరం విద్యార్థులకు అన్నదానం చేశారు. పాఠశాల విద్యార్థులకు అవసరమైన ఫ్రిజ్‌ను డాక్టర్ గజ్జల అందించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, అచ్యుత శివప్రసాదు, మౌలాలి, ముప్పాళ్ల మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఎం జేఎంరామలింగారెడ్డి, ఇందూరి నరసింహారెడ్డి, రెంటెద్దుల వెంకటేశ్వరరెడ్డి, నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లులో..

నకరికల్లు: డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నకరికల్లులో శనివారం ఘనంగా నిర్వహించారు. ముస్లింల ఆధ్వర్యంలో ఇస్లాం ధర్మం ప్రకారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు నమాజు టోపీ, కండువా బహూకరించారు. కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బీబాషా, సోషల్ మీడియా కార్యదర్శి పాలూరి రాజశేఖర్‌రెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు బైరెడ్డి పరమేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పరివర్తన పాఠశాలలో జరిగిన కేక్ కటింగ్‌లో గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి

బాకీ డబ్బులు అడిగినందుకు దాడి

నరసరావుపేట టౌన్: బాకీ డబ్బులు అడిగినందుకు దాడి చేశారనే బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ శనివారం తెలిపారు. మేడికొండూరు మండలం డోపర్తి గ్రామానికి చెందిన నాగండ్ల ఝాన్సీ నరసరావుపేట కంభంపాలెంలో నివాసం ఉంటున్న తన అక్క కుమారుడు కొండెపోగు దినేష్ కుమార్‌కు రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చింది. డబ్బులు తిరిగి ఇవ్వకపోవటంతో అడిగేందుకు శుక్రవారం అతని ఇంటి వద్దకు వెళ్లింది. బాకీ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఆమెపై దినేష్‌కుమార్, అతని అన్న నరేష్ ఇద్దరు అసభ్యకరంగా దూషించి దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాణసంచా తయారీ దుకాణంపై కేసు

చిలకలూరిపేటటౌన్: దీపావళి పండుగ సందర్భంగా ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్న ఒక దుకాణంపై చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీపావళి మందుల తయారీకి వివిధ శాఖల నుంచి పూర్తిస్థాయి అనుమతులు తీసుకోవాల్సి ఉండగా అలాంటి నిబంధనలను పాటించకుండా స్థానికంగా తయారు చేస్తుండటాన్ని పోలీసులు తమ తనిఖీల్లో గుర్తించి, సదరు దుకాణంపై కేసు నమోదు చేశారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: గ్రామాల్లో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సూచించారు. మండలంలోని వన్నాయపాలెం గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు మేకల వెంకటేశ్వర్లును పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా శనివారం వెంకటేశ్వర్లు మండలంలోని పార్టీ నాయకులతో కలసి నంబూరు శంకరరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విధి విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లో తీసుకెళ్లి బలోపేతం చేయాలని శంకరరావు సూచించారు. వెంకటేశ్వర్లును శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. తన నియామకానికి కృషి చేసిన శంకరరావు, ఎంపీపీ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డికి, మండల నేతలకు వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.


మేకల వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకరరావు, వైఎస్సార్ సీపీ నేతలు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

క్రోసూరు: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. స్థానిక నాలుగురోడ్లసెంటర్‌లో స్థానికులతో కలిసి శనివారం కేర్ యాక్టివిటీలో భాగంగా ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో నాటుసారా, డ్రగ్స్, గంజాయిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ టి.తులసి మాట్లాడుతూ సమాజంలో నాటుసారాయి, డ్రగ్స్, గంజాయి అలవాట్లు చెదపురుగులాంటివని అన్నారు. వీటి బారిన పడినవారి కుటుంబాలు అధోగతి పాలవుతాయన్నారు. ప్రజలు, యువత, విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా వీటిని వినియోగిస్తున్నట్లు తెలిసినా, ఎక్కడైనా విక్రయిస్తున్నారని తెలిసినా ఎక్సైజ్‌శాఖ అధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్. సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


నాటుసారా, డ్రగ్స్, గంజాయిపై అవగాహనలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ తులసి, సిబ్బంది

బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలి

బెల్లంకొండ: బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపి, ముందుండాలని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శాంతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 'హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్' సంస్థ ఆధ్వర్యాన అంతర్జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాలికలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, వివక్ష, సమాజంలో బాలికల పాత్ర అనే అంశాలపై వ్యాస రచన, డిబేట్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. హెచ్ఎం శాంతి మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. బాలికలు బాగా చదువుకోవాలని, డ్రాపౌట్స్ లేకుండా ఉండాలని తెలిపారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్ మాట్లాడుతూ బాలికలు వారి హక్కులను గుర్తించాలని, విద్యా, ఆరోగ్యం, బాల్యవివాహాలు, లింగ వివక్ష వంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మనోహర్, శామ్యూల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నకరికల్లు: బాలికలను చదివిస్తే కుటుంబమంతా విద్యతో విరాజిల్లుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ రమీజున్ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నకరికల్లులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలను ప్రోత్సహిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యానేరమన్నారు. కార్యక్రమంలో కె.వి జయలక్ష్మి, ఎం.వి.లక్ష్మి, జి.రాజ్యలక్ష్మి, వి.యలమందమ్మ, వి.మరియమ్మ, ఎస్.సావిత్రి, ఎన్.మాధవి, ఆర్.కోటేశ్వరి పాల్గొన్నారు.


బెల్లంకొండ జెడ్పీ పాఠశాలలో బాలికా దినోత్సవం


బాలికలకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వైభవం.. ప్రతిష్ఠా మహోత్సవం

ఘనంగా హరిహర క్షేత్ర మందిర విగ్రహ ప్రతిష్ఠ


వేంకటేశ్వర విగ్రహం


ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం


పరమేశ్వర విగ్రహం


ప్రతిష్ఠసందర్భంగా నిర్వహించిన హోమాలు

రొంపిచర్ల: మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన హరిహర క్షేత్ర మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. త్రయాహ్నిక దీక్షా విధానంగా ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. హరిహర క్షేత్ర మందిరంలో వినాయక, వేంకటేశ్వర, పరమేశ్వర, నందీశ్వర, గరుత్మంత విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొన్నారు. వేలాది మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ప్రతిష్ఠ సందర్భంగా బంధుమిత్రులు, పరిచయస్తులతో గ్రామంలో సందడి నెలకొంది.

ఉన్నత వ్యక్తిత్వంతో ఉత్తమ జీవితం

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థులు, ఐఏఎస్ అకాడమీ ఫ్యాకల్టీ శరత్ చంద్ర అకడమిక్ హెడ్ శివకుమార్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీ పరీక్షలలో విజయం సాధించటానికి ప్రాథమిక సూత్రాలు ఉపకరిస్తాయన్నారు. ఉన్నతమైన వ్యక్తిత్వంతో ఉత్తమ జీవితాన్ని సాధించుకోవచ్చని విద్యార్థులకు ప్రేరణ దాయకంగా ఉపన్యాసం అందించారు. తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్న ఎ.నరసింహారావు మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థలో ప్రవేశించడానికి గల సన్నద్ధతను, విధి విధానాలను విద్యార్థులకు వివరించారు. గురజాల మోడల్ జూనియర్‌కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం అధ్యాపకుడు డి.సాంబశివరావు డిగ్రీ విద్యతో ఉన్న అపార ఉద్యోగ అవకాశాలను విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నయింభాను, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ విజయకుమార్, ఇంగ్లిష్ అధ్యాపకుడు డాక్టర్ ఎస్‌కే మహమ్మద్ బాష, విద్యార్థులు పాల్గొన్నారు.


కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి శివకుమార్

క్రీడా సామగ్రి అందజేత



పిడుగురాళ్ల: మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 1998–99 10వ తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలకు క్రీడా సామగ్రిని బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు మాట్లాడుతూ... విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంపొందించడానికి ఇటువంటి చర్యలు దోహదపడతాయన్నారు. పూర్వ విద్యార్థులు బెల్లం కిషోర్, మునగా వెంకట్, యారం మల్లికార్జున్‌రెడ్డి, దేసినేని వెంకట్, మంగయ్య, భరత్, జానీభాషా, పిచ్చయ్య, సాగర్, మురళి, శ్రీను, గోపాల్, నర్రా వెంకట్రావు, తాజుద్దీన్, నాసర్‌వలి, శంకర్, బికారి సాహెబ్, ఆనంద్ పాల్గొన్నారు.

యోగాతో ఆనందమయ జీవితం

నరసరావుపేట రూరల్: యోగా ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందని శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకుడు డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర యోగా గురూజీ తెలిపారు. రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ ఉచిత యోగ శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర యోగ గురూజీ అనుగ్రహభాషణం అందించారు. విద్యార్థి దశలోనే యోగా సాధన చేయడం ద్వారా ప్రతిభ కనబర్చడంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. 28రోజులు పాటు యోగా తరగతులకు హాజరైన వారికి, శ్లోకాలు అప్పజెప్పిన వారికి ప్రతిభా పురస్కారాలను బోధక యోగాచార్యులు జల్లి శ్రీనివాసరావు గురూజీ అందజేశారు. ఎంఏఎం కళాశాలల చైర్మన్ ఎం.శేషగిరిరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ గుంటుపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం, నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో 189వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురూజీ మాట్లాడుతూ యోగా శిక్షణ పూర్తిచేసుకున్న వారు గురుదక్షిణగా రోజుకు 30 నిమిషాలు యోగసాధన చేయాలని తెలిపారు.

నాదెండ్ల: యోగాలో నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నరసరావుపేట శంకరభారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవలే డివిజన్ స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నాదెండ్ల జిల్లాపరిషత్ విద్యార్థులు అండర్–14 విభాగంలో సాత్విక్, కార్తీక్, అనూష, అండర్–17లో మహేశ్వరి, వెంకటసాయి ప్రతిభ కనబరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

యోగా పోటీలకు 'ధనలక్ష్మి' విద్యార్థి ఎంపిక

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయమా కళాశాలకు చెందిన శివరాత్రి గోపి (ప్రథమ ఎంపీఈడీ విద్యార్థి) ఫిజికల్ ఎడ్యుకేషన్ పోటీలల్లో యోగా పురుషుల జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు చుండు వెంకరావు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాలల పోటీల్లో ఎంపికైనట్లు పేర్కొన్నారు.